క్లుప్తంగా

పరశురాముడు.. మదిలో దేవుడు



కృష్ణ కామేశ్వర్ సేకరించిన పరశురాముడి తపాలా బిళ్లలు

అమలాపురం టౌన్: విష్ణుమూర్తి దశావతారాల్లో ఆరవదైన పరశురాముడు ముఖచిత్రంతో భారతీయ తపాలా శాఖ రూ.5 విలువ గల తపాలా బిళ్లలను విడుదల చేసింది. వీటిని అమలాపురానికి చెందిన తపాలా బిళ్లల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు. శనివారం పరశురాముడి జయంతోత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ వీటిని ఈ నెల 19న విడుదల చేసింది.

ఎస్పీ శ్రీధర్‌కు శుభాకాంక్షలు



జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు మొక్కను అందిస్తున్న వామపక్ష నేతలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుసారపు శ్రీధర్‌ను వామపక్షాల జిల్లా నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వామపక్షాల నాయకులు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన్ని కలసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అడపా సత్యనారాయణ, మోకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

తాళ్లరేవు: కాజులూరు మండలంలో అనుమానాస్పద స్థితిలో ఇద్దరు దళిత యువకులు మృతి చెందారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు ఓ ప్రకటనలో కోరారు. యువకుల మృతి ఘటనకు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ వితరణ



ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేస్తున్న పిన్నంరాజు వెంకటపతిరాజు

ఐ.పోలవరం: వేసవిలో పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు మజ్జిగ వితరణ చేశారు. కేశనకుర్రులో ఉపాధి కూలీలకు శుక్రవారం ఆయన మజ్జిగ అందజేశారు. ఇలాగే వేసవిలో పనిచేస్తున్న కూలీలకు ప్రతి నిత్యం మజ్జిగ అందిస్తానని ఆయన తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి రంగరాజు, కాశి పరివాజ్ కుమార్, మెకా రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన ఉంగరాల రామచంద్రరావు జయంతి సందర్భంగా ఆయన కుమారుడు రవీంద్ర నిరు పేదలకు అన్నదానం చేశారు. తొలుత రామచంద్రరావు చిత్రపటానికి నాయకులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుమారు 100 మందికి భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, కృష్ణ, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు



ప్రజలకు నీటిని అందిస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, నాయకులు

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెం వినాయకగుడి సెంటర్ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీరాంబాబు చర్యలు తీసుకున్నారు. సమస్యను ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారికి తెలిపి శుక్రవారం ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయించారు. కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా సరఫరా చేశామని, సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని ఎంపీడీవో తెలిపారు. వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లా నాయుడు, సూర్యప్రకాష్, వెంకటనారాయణ, ఆకుల ఈశ్వరరావు, సాదే వీరాంజనేయులు, నల్లా శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెకోత మిగిల్చి నది

- బాలయోగి వారిధి పైనుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యలు
- ఏటా 30 వరకూ సంఘటనలు
- వంతెనపై ఫెన్సింగ్ ఏర్పాటుకు వినతి



ఆత్మహత్యలకు కేంద్రంగా మారిన యానాం- ఎదుర్లంక బాలయోగి వంతెన



కాకినాడ జగన్నాథపురం వంతెనపై ఇనుప ఫెన్సింగ్ (ఇలా బాలయోగి వారధిపై వేస్తే ఆత్మహత్యలు నివారించవచ్చు)

యానాం: క్షణికావేశం అనేక కుటుంబాల్లో చిచ్చు రేపుతోంది.. ఆత్మహత్యలకు పురిగొల్పుతోంది.. మారుతున్న కాలానికి తగ్గట్టు పరుగులు తీయలేక కొందరు.. ఆర్థిక, మానసిక, వ్యక్తిగత కారణాలతో ఇంకొందరు తనువు చాలిస్తున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి కడుపుకోత మిగుల్చుతున్నారు. యానాంలో ఏటా బాలయోగి వారధి పైనుంచి ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య పెరుగుతోంది. ఇది ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. 216 జాతీయ రహదారిలోని అమలాపురం- కాకినాడ మధ్య ఉన్న యానాం-ఎదుర్లంక బాలయోగి వంతెనపై నుంచి గౌతమీ గోదావరిలో దూకి అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతి నెలా రెండు నుంచి మూడు ఘటనలు ఇక్కడ జరుగుతున్నాయి. సంవత్సరానికి సుమారు 30 వరకు ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో యువతీ, యువకులు, వివాహితలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ముఖ్యంగా కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాలు, ప్రేమ వ్యవహారాలు, నిరాస నిస్పృహలతో ఉన్నవారు ఈ ఆత్మహత్యలకు ఈ వారధిని కేంద్రంగా చేసుకుంటున్నారు. వీటిని ఏవిధంగా అరికట్టాలో తెలియక అధికారులు, పోలీసులు తర్జనభర్జన పడుతున్నారు.

రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో..

యానాం- ఎదుర్లంక వారధి పరిధిలో రెండు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వంతెనకు కుడివైపు కొంతభాగం యానాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వస్తే.. ఎడమవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో యానాం వైపు ఆత్మహత్యలను అడ్డుకునే విధానంలో భాగంగా నిత్యం యానాం పోలీసులు నిఘా ఉంచుతున్నారు. ప్రత్యేకంగా రాజీవ్ బీచ్ వద్ద టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ సీసీ కెమేరాలను సైతం పెట్టారు. పలువురు పర్యాటకుల రక్షణార్థం అక్కడ పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రాత్రివేళల్లో ఆత్మహత్యలకు పాల్పడేవారు ఎక్కువగా ఉంటున్నారు. చాలా సందర్భాల్లో పోలీసులు, మత్స్యకారులు నావల్లో వెళ్లి ఆత్మహత్యకు పాల్పడే వారిని రక్షిస్తున్నారు. గోదావరిలో మృతదేహాలను గుర్తించడం, కుటుంబీకులకు అప్పగించడం కష్టంగా మారుతుంది.

ఇలా చేస్తే నివారించవచ్చు

బాలయోగి వారధి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడేవారిని నియంత్రించేందుకు వారధి వద్ద యానాం వైపు నుంచి ఎదుర్లంక వైపు వరకు 1.80 కిలోమీటర్ల మేర పొడవైన ఐరెన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల గోదావరిలోకి దూకేవారిని అరికట్టవచ్చు. ఈ మేరకు గతంలో ఆర్ఏఓ మునిస్వామికి, ఎంపీ వైద్యలింగంకు పలువురికి వినతిపత్రాలు సమర్పించారు. కాకినాడ జగన్నాథపురం రెండో కొత్త వంతెనపై ఐరెన్‌తో ఫెన్సింగ్ వేసిన విధంగానే బాలయోగి వారధిపై నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం..



యానాం- ఎదుర్లంక బాలయోగి పైనుంచి ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనల నివారణకు రాజీవ్ బీచ్ పరిసర ప్రాంతాల్లో నిత్యం పోలీసు నిఘా కొనసాగుతుంది. ఇలా పలువురిని రక్షించాం. ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడేవారని అనుమానం వస్తే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– శేరు నూకరాజు, ఎస్సై, యానాం

ఆక్వా చెరువులకు బీమా చేయాలి

యానాం: ఆక్వా చెరువులకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ద్వారా బీమా చేయించాలని ఆ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అజిత్‌స్టాలిన్ తెలిపారు. శుక్రవారం ఫిషింగ్ వెసల్స్, బ్రాకిష్ వాటర్ రొయ్యల చెరువులు, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన- ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షులు ఇన్సూరెన్స్ క్లయిమ్ గురించి ప్రతి ఒక్కరిలో అవగాహన తీసుకురావాలని కోరారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామిని కలసి మత్స్యశాఖ గుర్తించిన చెరువులను పరిశీలించారు. ఏడీ దడాల గొంతియ్య పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు రాత పరీక్ష

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 23న ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని చొల్లంగిపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పి.పద్మావతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఇంటర్‌లో ప్రవేశాలకు పరీక్ష జరుగుతుందని అన్నారు. ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్‌టీఈఆర్ వెబ్‌సైట్‌లో ఇంటర్ అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

అక్షయ పాత్ర సేవలు అభినందనీయం



ఔషధీకృత చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: ఎండల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో ఔషధీకృత చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక నల్ల వంతెన- ఎర్రవంతెన మధ్య బైపాస్ రోడ్డులో కాలభైరవ శక్తి స్థల్ వద్ద బాటసారులు, వాహనచోదకులు సేద తీరేందుకు చలువ పందిరిలో ఏర్పాటు చేసిన ఔషధీకృత రాగి జావ, చల్లని మజ్జిగ చలి వేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షయ పాత్ర సంస్థ అటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరోపక్క సేవలు అందిస్తోందని అన్నారు. కొద్దిసేపు బాటసారులకు ఆయనే స్వయంగా రాగిజావ, మజ్జిగ అందించారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రాగి జావ, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేస్తామని అక్షయపాత్ర ప్రతినిధి పోతురాజు కనకదుర్గ తెలిపారు. తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి, డాక్టర్ చీకట్ల వెంకట నారాయణ, ఇస్కాన్ అమలాపురం కేంద్ర ఇన్‌చార్జి శివానంద నిమయి దాస్, శ్రీగౌతమ మహర్షి గోసంరక్షణ గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

అమలాపురం ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం వీధి, శ్రీదేవి మార్కెట్, బస్ స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, తహసీల్దార్ పరమట పల్లవి, చాంబర్ ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, కుప్పాల రామకృష్ణ, నడింపల్లి అప్పలరాజు, కొప్పిశెట్టి మోహనరావు, ఎస్‌కే ఖ్వాజాబాబు పాల్గొన్నారు. చాంబర్ చేస్తున్న సామాజిక సేవలను కలెక్టర్ తదితరులు అభినందించారు.

లేగ దూడల ప్రదర్శన



చెయ్యేరులో లేగ దూడల ప్రదర్శన

కాట్రేనికోన: చెయ్యేరులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఏడాది వయసున్న 62 లేగ దూడలను రైతులు ప్రదర్శనకు తీసుకొచ్చారు. ఇందులో విజేతగా త్సవటపల్లి శ్రీనుకు చెందిన లేగ దూడలు నిలిచాయి. దీంతో ఆయనకు బహుమతులు అందజేశారు. రైతులలో పశు పెంపకంపై ఆసక్తిని పెంచడానికి లేగ దూడల ప్రదర్శలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.జైపాల్ తెలిపారు. అమలాపురం ఉప సంచాలకుడు కర్నీడి మూర్తి, ఉప్పలగుప్తం సహాయ సంచాలకుడు నాగేశ్వరరావు, పశు వైద్యాధిరులు ఎ.రమేష్‌కుమార్, పి.సుధీర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు



రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న సీఎం జగన్ ఫాలోవర్స్ ప్రతినిధి వెంకన్నాయుడు, వైద్యాధికారులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సీఎం జగన్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ శుక్రవారం జరిగింది. ముక్త భారత్ -నిక్షయ్ మిత్ర వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, సీఎం జగన్ ఫాలోవర్స్ ప్రతినిధి వంటెద్దు వెంకన్నాయుడు వీటిని అందజేశారు. డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు దొర, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త పద్మశ్రీరాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో భారతలక్ష్మి, జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ పీకే శ్రీనివాస్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ రోగులు పౌష్టికాహారం తీసుకుని క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి తొందరగా నయం అవుతుందన్నారు. సీఎం జగన్ ఫాలోవర్స్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నెల్లి సావిత్రి, జల్లి సుజాత, పెట్టా సత్యనారాయణ, మోరం నాని, చింతలపూడి వెంకన్నబాబు, అత్తిలి గణేష్ తిక్కా బాబి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలుత సరస్వతి మాత, స్వామి వివేకానంద చిత్రపటాలకు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సాయి సత్యనారాయణ, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు పూలమాలలు వేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. మే 10న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఏబీవీపీ ఏర్పాటు చేసిన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ సభ్యుడు సాయి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఉంటుందని ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి నరేంద్ర తెలిపారు. ఏబీవీపీ నగర కార్యదర్శి నాగేంద్ర, హాస్టల్స్ కన్వీనర్ మణికంఠ, అధ్యాపకుడు గుణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా అభిమానం



చినబొడ్డు వెంకటాయపాలెంలో పథకాల గురించి వివరిస్తున్న నాయకులు



కుండలేశ్వరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో గృహ సారథులు, కన్వీనర్లు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరుగుతోంది. ప్రతి ఇంటా ప్రజలు అభిమానం చూపుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోరంగి పంచాయతీ పరిధి చినబొడ్డు వెంకటాయపాలెంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, నాయకులు ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనపై ప్రజా సర్వే చేశారు. ఇంటి యజమాని అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను తలుపులకు అతికించారు. నాయకులు కొపనాతి నాగరాజు, బర్రే కాటవేణి, సంగాడి శ్రీను, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా సాగుతుంది. ప్రభుత్వ పనితీరుపై ఐదు ప్రశ్నలకు ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నారు. నడవపల్లి సచివాలయం పరిధి కుండలేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, సాని నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, అక్కల శ్రీధర్, శివరామకృష్ణ, రంబాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వానికి ఆదరణ

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు, మురమళ్ల, కొమరగిరి తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సీఎం జగన్ పాలనకు ప్రజల ఆదరణ లభిస్తుందని మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, మెకా రవి, ఇందుకూరి రంగరాజు, నడింపల్లి గణపతి మూర్తి వర్మ, ఏలూరి ఆదినారాయణ తదితరులు అన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



బండారులంకలో ముస్లింలతో కలసి ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అమలాపురం రూరల్: రంజాన్ మాసం సందర్భంగా బండారులంక మెయిన్ రోడ్డులోని మహమ్మద్ నబీ మజీద్‌లో ముస్లింలకు వైఎస్సార్ సీపీ నేతలు కామిశెట్టి శ్రీనివాసరావు, జాన గణేష్, అంకం పెదరాజు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అమలాపురం షాదీ ఖానాలో ముస్లింలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. నాయకులు మహదశ నరసింహారావు, సూదా చిన్నా, పండి రాజా, చిక్కం కిట్టు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మల్లాడికి పరామర్శలు





మాజీ మంత్రి మల్లాడిని పరామర్శిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ

యానాం: చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన మాజీ మంత్రి, ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావును శుక్రవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ మల్లాడిని పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఏకేడీ ఆర్ముగం, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంత్, భాస్కర్ తదితరులు మల్లాడిని కలిశారు. అలాగే యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, నేటి యువతరం ప్రజాచైతన్య సమితి అధ్యక్షుడు కాశి బుద్దాజీ తదితరులు మల్లాడిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

అమలాపురం టౌన్: స్థానిక మార్కెట్ ప్రాంతంలో కొందరు గోవధ చేశారన్న అంశం గో ప్రేమికులను ఆందోళనకు గురిచేసింది. ఆవు దూడలను వధించి మాంసంగా విక్రయించారని సోషల్ మీడియాలో శుక్రవారం హల్‌చల్ చేయడంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, గో ప్రేమికులు డిమాండ్ చేశారు.

ఎస్సై శ్రీను నాయక్‌కు సత్కారం



ఎస్సై శ్రీను నాయక్‌ను అభినందిస్తున్న ఎంపీడీఓ సరోవరరావు, తహసీల్దార్ ప్రసాద్

అల్లవరం: బోడసకుర్రు సచివాలయాన్ని దగ్ధం చేసేందుకు పెట్రోల్ పోసి నిప్పెట్టిన నిందితుడిని ఒక్క రోజులోనే పట్టుకుని రిమాండ్ విధించడంలో కీలకపాత్ర పోషించిన అల్లవరం ఎస్సై శ్రీను నాయక్‌ను మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ జి.సరోవరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సై సేవలను కొనియాడారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్సైను శాలువాలతో సత్కరించారు. తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తత ముఖ్యం



ప్రాణ రక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు

మలికిపురం: తుపాన్ల వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలికిపురం తహసీల్దార్ వీవీ నరసింహారావు పేర్కొన్నారు. కేశనపల్లిలో తుపాను ఆశ్రయ భవనంలో 10వ ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన అప్రమత్తత, అవగాహన, డెమో ప్రదర్శనలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విపత్తుల సమయంలో నష్ట నివారణకు అధిక ప్రాధాన్యం ఉంటుందని, ఆ దిశగా తగిన శిక్షణ, సన్నద్ధతతో ఉండాలని ఆయన సూచించారు. రానున్న కాలం తుపాన్లు సంభవించే సమయమని, అందుకు తగిన విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తి సన్నద్ధంగా ఉందని తెలిపారు. సర్పంచ్ యెనుముల నాగు అధ్యక్షతన జరిగిన సభలో బెటాలియన్ కమాండర్ టి.రాజేష్‌కుమార్ సరోజ్, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు ఎంపీడీఓ ఉండ్రు బాబ్జిరాజు, సర్పంచ్‌లు మందపాటి నాగేశ్వరరావు, రాపాక ఆనంద కుమార్, గుర్లింక సత్తిబాబు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య నివారణకు చర్యలు



చల్లపల్లి సబ్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ శాఖ సిబ్బంది

ఉప్పలగుప్తం: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. చల్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో రూ.కోటితో అదనపు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. దీనివల్ల చల్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని చల్లపల్లి, నక్కారామేశ్వరం, ఎస్.యానం, గోపవరం, వాసాలతిప్ప, సరిపల్లి గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందని ఆయన వివరించారు. ఈ పనులను డీఈఈ ఎ.వీరభద్రరావు, ఏఈఈ టి.శ్రీహరి పర్యవేక్షించారు.

సొసైటీల అభివృద్ధికి బాటలు వేయాలి

అంబాజీపేట: సొసైటీల అభివృద్ధికి చైర్‌పర్సన్లు బాటలు వేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిరతపూడి సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన బొంతు శ్రీనివాస్ పదవీ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారాన్ని శుక్రవారం నిర్వహించారు. సీఈఓ కుంపట్ల సత్యనారాయణ పర్యవేక్షణలో చైర్‌పర్సన్ శ్రీనివాస్‌తో పాటు సభ్యులు నక్కా సత్యనారాయణ, రంపం గోవిందులతో ఎమ్మెల్యే చిట్టిబాబు, పార్టీ రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్‌పర్సన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చిట్టిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి పళ్లాలమ్మ జాతర

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలోని బోనం మెరకలో కొలువుదీరిన గ్రామదేవత పళ్లాలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం మహిళలతో సామూహిక అష్టోత్తర శతకలశ పూజ, సామూహిక కుంకుమార్చనలు, వివిధ పుష్ప, ఫలార్చనలు, విశేష మహా నివేదన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. శ్రీగణపతి, శ్రీమహాకాళీ, మహాలక్ష్మీ, మహా సరస్వతి, ఆదిమూల శాంతి హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు. అదే రోజు రాత్రి అమ్మవారి జాతర జరుగుతుందన్నారు.